







# కల్యాణమ్మ

యర్రంశెట్టి శాయి

అందరిలా కాకుండా ఆ వార్డులోని ప్రజలకి దురాశలు వున్నయి. అన్నీ కోరికలు. అందుకనే మునిసి లిటీలో ఆ వార్డువాళ్లని చూస్తే మిగతా వూరంతటికీ కోపం. పైగా అక్కడి వాళ్లు, ప్రతివాడూ పాలిటిక్స్ మాట్లాడు తూంటాడు. వాళ్ల కోరికల్లో ముఖ్యమయినవీ, అనవ్యా మయినవీ ఇవి

"తమ వార్డుకి కంకర రోడ్లు కావాలి. వీధికొకటయినా కొళాయి వుండాలి. ప్రతి వీధిలోనూ ఎలక్ట్రిక్ దీపాలుండాలి. తమ వార్డులో అవసాన దశలో వున్న పార్కుని బాగుచేయాలి, చిన్న పిల్లలు నడవలేరు గాబట్టి దగ్గరలోనే ఓ మునిసిపల్ మిడిల్ స్కూల్ నిర్మించాలి" ఎవరికయినా వళ్లు మండుతుంది ఈ గొంతెమ్మ కోరికలు వింటూంటే. వార్డులో వాళ్లందరూ, మునిసిపల్ ఎలక్షనయిన తరువాత, మళ్లీ కనిపించని తమ వార్డు కౌన్సిలరు గారి దగ్గరకు రిప్రజెంటేషన్ పంపించి, తమ ఆ పాడు కోరికలన్నీ ఆయన ముందుంచే సరికి అందరిలాగే ఆయనకీ వళ్లు మండింది అందుకనే "అవన్నీ నావల్ల కాదు . ఆమాటకొస్తే ఇంకెవడి వల్లా కూడా కాదు... మీరు నన్ను బెదిరించొద్దు . వచ్చే ఎలక్షన్సులో నేను నుంచోడం లేదు" అనేసి అక్కడ్నుంచి వెళ్లి పోయాడు. ఆ మాట విన్న వార్డు ప్రజలకి వళ్లు మండి చల్లారే లోపల మళ్లా మునిసిపల్ ఎలక్షన్లు చక్కా తిరిగొచ్చినయి.

* * *

కల్యాణమ్మ అంత మంచి మనిషి ఆ పేటలోనే కాదు, ఆ వార్డులోనేకాదు, ఆ వూళ్లోనే లేదని చాలా మంది అభిప్రాయం. ఒకో మనిషిని చూస్తే, ఎంచేతో గాని, ఒహోసారి అలాంటి అభిప్రాయం కలుగుతుంటుంది. ఆ అభిప్రాయం ఎంతవరకూ నిజమో చాలా మందికి తెలీదు తెలిసిన కొద్ది మంది కాసేపు ఆలోచించి "ఏమోలే" అని వూరుకొన్నారు. ఏది ఏమయినా, ఆవిడ కల్యాణిగా వున్నప్పుడు, అంటే ఆవిడ కాలేజీలో చదువుకొనే రోజుల్లో ఆవిడ పేరు నలు క్లాసులా ప్రాకి పోయింది. అయితే అప్పుడు అదలా ప్రాకడం ఆవిడ మంచి తనం వల్లనే అని మన మనుకోడం ఏమంత సమంజసం కాదు అదొక కారణం కావచ్చును. అసలు కారణం ఆమె అందం ఆమెని చూసిన ప్రతి కుర్రాడూ ఆమె అందాన్ని చూసి "హాయ్! హాయ్!" అని గుండెల మీద చెయ్యి వేసుకొనే వాళ్లు. కొంత మంది పి యు సి. కుర్రాళ్లామెను "బ్యూటీరోజ్" అని పిలవడం మొదలెట్టారు అది విని ఫైనలియర్ కుర్రాళ్లు, పి యు సి. వాళ్లనో కోప్పడ్డారు. "బ్యూటీరోజే"మిటన్నారు. రోజ్ బ్యూటీగానే వుంటుంది గదా మళ్లీ బ్యూటీ రోజ్ అనడం ఎందుకు అన్నారు. కూాక లేకారు తప్పన్నారు.

తప్పయిందని ఒప్పుకున్నారు పి.యు.సి. వాళ్ళు. 'మీరు జూనియర్స్ కదా, అసలు మిమ్మల్నందుకే పేర్లు పెట్టనీంది" అన్నారు. కల్యాణిని "బ్యూటీ క్వీన్" అనాలన్నారు. హాశ్చర్య పోయారు పి యు సి. వాళ్ళు. 'నిజంగా మీరు సీనియర్సే' అన్నారు, అనుకున్నారు. సంతోషపడి మర్నాటి నుంచీ అదే పేరెట్టి ఆమెని పిలుచుకోడం మొదలెట్టారు. కల్యాణి కీ సంగతులేమీ తెలీ పోయినా గాని మొత్తానికి తనని "బ్యూటీరోజ్' అనే వాళ్ళనీ, కానీ ఉన్నట్టుండీ 'బ్యూటీ క్వీన్' అని పిల్చుకొంటున్నారనీ తెలుసుకుంది. అయితే తన పేరలా ఎందుకు మారిందో ఆమెకు తెలియలేదు. కాసేపు ఆలోచించి అంతు దొరక్క 'ఏమోలే' అనుకుంది. కాని అలా అని వూరుకోలేదు మర్నాటి నుంచి మరి కొంచెం 'ఇది' గా అలంకరించుకొని రావడం మొదలెట్టింది. కాలేజీలో ప్రతి కుర్రాడూ ఆమెతో మాట్లాడాలని తహతహ పడుతూండే వాడు. పనున్నా లేకపోయినా వూరికే కల్పించుకుని మాట్లాడ్డానికి ప్రయత్నించే వాళ్ళు. ఏ మాత్రం సందు దొరికినా మాట్లాడేవాళ్ళు కొంత మంది దొరక్క పోయినా మాట్లాడేవాళ్ళు. కల్యాణి కూడా మిగతా అందరి అమ్మాయిల్లా వుండేది కాదు. అడ్డమయిన కుర్రాడి తోటీ మాట్లాడేది "ఏమాత్రం సిగ్గు పడదు" అనుకున్నారు కుర్రాళ్ళు. "ఏ మాత్రం సిగ్గులేదు" అనుకున్నారు మిగతా ఆడ పిల్లలు.

ఏ అమ్మాయయినా, మగపిల్లలతో మాట్లాడాలంటే వోణీల్లో మొఖం దాచుకొని, చీర కొంగులో నవ్వుదాచుకొని తల్ల క్రిందులయి పోతూంటారు. కాని ఈ అమ్మాయి మొగ పిల్లలతో డీలక్స్ బస్ స్పీడులో మాట్లాడుతోంది. ఆ మాటకొస్తే, అసలు మొగపిల్లలతోనే ఎక్కువ మాట్లాడుతోంది. అంచేతే ఆమెకి ఆడపిల్లల్లో గౌరవం తగ్గింది కాని మొత్తం మీద గౌరవం హెచ్చింది అంచేతే ఆయేడు 'స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్ షిప్'కి పోటీ చేద్దామనుకుని, పోటీ లేపోయే సరికి నుంచుని గెల్చుకొంది. అసలు ఆమె అలా గెలవాలని చాలామంది కోరుకోలేదు అందుకే సుబ్బారావుని నుంచోబెట్టారు ఎదురు. ఎవరో సుబ్బారావు పేరు నామినేట్ చేశారు. ఇంకొకళ్ళు సపోర్ట్ చేశారు. దాంతో సుబ్బారావు రంగంలోకి దూకాడు. కరపత్రాలు అయిదు వేలు అచ్చు గుద్దించి విరజిమ్మేశాడు తెలిసిన కుర్రాళ్ళని "రాగురూ! కాఫీ త్రాగుదాం!" అన్నాడు నవ్వేస్తూ. తెలియని వాళ్ళని "నీకూ్కడా కాఫీ త్రాగిపొమ్మని చెప్పాలా! అలా బయటివాడిలా చూస్తావే?" అంటూ గదమాయించి, జబ్బ పట్టుకొని ఎదురుగా వున్న చంద్రం బాబాయి హోటలుకి లాక్కుపోయాడు.

"నన్ను గెలవనీండి గురూ! ప్రిన్సిపాలునీ, మేనేజిమెంటునీ ఆడించేస్తాన"న్నాడు. అసలిప్పుడు మాత్రం ఆడటంలేదా అన్నాడు. తనంటే ఎప్పుడూ ఆడతారన్నాడు ఇంకెవళ్ళకీ వాళ్ళు ఆడరన్నాడు. పైగా ఆడిస్తారన్నాడు. పి. యు. సి. చదువుతున్న పిన్ని కూతురు వసంతతో ఆడపిల్లల్లో కూడా కాన్వాస్ చేయించుకొన్నాడు. దాంతో సుబ్బారావు "స్ట్రెంగ్త్" పెరిగిపోయింది. ఏ కుర్రాడిని చూసినా సుబ్బారావు అంటున్నారు. చూడకపోయినా అంటున్నారు. కొంత మంది ఆడపిల్లలు కూడా ఆదేమాట అంటున్నారు ఇదంతా చూసి కల్యాణికి భయం వేసింది ప్రతి కుర్రాడినీ 'రెక్వెస్ట్' చేసి మరీ ఓటడుగుతోంది. 'ప్లీజ్' అంటోంది. నన్ను మీరే నుంచోమన్నారు కదా అందుకే నుంచున్నానంది. లేపోతే ఆడపిల్ల తేలిగ్గా గెలవలేదన్న సంగతి నాకు తెలియదా అంది. 'నేను తప్పకుండా ఓటు మీకే ఇస్తా'నని వాళ్ళంటే 'నేనడిగేది మీ సంగతికాదు. మీ ఫ్రెండ్స్ సంగతంది'. ఎంతయినా ధైర్యం చాలలేదు. ఓడిపోతే ఇంక కాలేజీలో ఏమొఖం పెట్టుకు తిరగాలో అర్థంకాలేదు. చివరకో రోజు రాధతోపాటు సుబ్బారావు ఇంటి కొచ్చేసింది. సుబ్బారావు గాభరాపడి పోయాడు. వాళ్ళువచ్చినందుకు కాదు నాన్నగారు ఇంట్లో వున్నందుకు. ఏం చేయాలా అని ఆలోచించాడు. వాళ్ళని చెల్లాయ్ గది లోకి తీసుకుపోయి కూర్చుండబెట్టాడు. నాన్నగారడిగితే 'చెల్లాయి కోసం వచ్చారుట' అన్నాడు నాన్నగారు పూజామందిరంలోకివెళ్ళగానే గాభరాగా వాళ్ళ దగ్గరకొచ్చి "ఏమిటి సంగతి? త్వరగాచెప్పండి! పూజ అయిపోతుం"దన్నాడు కల్యాణి జాలిగా అతని వంక చూసింది ఆమెకి ఏవరో చెప్పారుట సుబ్బారావు—అలాంటిచూపులకి ఒక్క కరిగిపోయే మనిషని. అందుకే అలా చూసింది. కాని సుబ్బారావు కరగలేదు. అతనికి రాఘవరావు చెప్పాడు. ఎలక్షన్సులో కరగొద్దని. కల్యాణి అప్పుడు అదే చూపుని రాధ వేపు డైవర్టు చేసింది. రాధ లేచింది. కిటికీ దగ్గరకు పోయి అటువేపు తిరిగి ఇంకెటో చూస్తూ "సుబ్బారావుగారూ!" అంది విషాదంగా.

"మిమ్మల్ని బ్రతిమాలుకొంటున్నాం. మీరు విత్‌డ్రా అవ్వండి. మీరంటే మా కెంతో అభిమానం. కల్యాణి ఓడిపోతే మీరోడిపోయినట్టు కాదా!" అంది మనలో మనకి పోటీ ఏమిటంది.

సుబ్బారావు ఏమీ మాట్లాడలేదు.

"పోనీలే మీకంత ఇదిగావుంటే మీరే గెలవండి. ఇదిగో కల్యాణి విత్‌డ్రా లెటరంది. కాని ఓటెగుర్తుంచుకోమంది. కల్యాణి మళ్ళీ చదువుమానెత్తదు. కాలేజీపూర్తిగా మానేస్తుందంది. అసలు మీరు నుంచుంటున్నారని తెలుస్తే కల్యాణి ఎంతమాత్రం పోటీ చేసేదికాదంది. మీకంటే కల్యాణికి బోలెడు గౌరవం కూడా ఉందంది. ఈలోపల కల్యాణి మరోసారి జాలిగా అతని వంక చూసింది.

"రాధా" అన్నాడు సుబ్బారావు బాధగా.

తరువాత కొద్ది నిమిషాల్లోనే సుబ్బారావు పూర్తిగా కరిగిపోయాడు.

"సరే! కల్యాణీ! విత్‌డ్రా అయ్యాను!" అన్నాడు.

కల్యాణి ఒక్క ఉదుటున లేచింది. 'షేక్‌హ్యాండ్' ఇచ్చిందతనికి.

"మీరెంతో ఉదార హృదయులు' అంది ఇదిగా చూస్తూ. ఇద్దరూ నమస్తే చెప్పి వెళ్ళిపోయారు. తరువాత కల్యాణి పోటీ లేకుండా నెగ్గింది.

అయితే ఈ వ్యవహారమంతా కల్యాణి క్లాసుమేటు భీమారావు చూస్తూనేవున్నాడు. "ఆహా కల్యాణీ! అందమంటే నీదనుకొన్నాను.. తెలివి కూడా నీదేనా?" అనుకొన్నాడు కాస్త పోగి "ఈ రెండూ నావయితే బావుండున"ని ప్రయివేటుగా అనుకొన్నాడు అదేమాట తరువాత వాళ్ళమ్మ దగ్గర పబ్లికుగా అనేశాడు. అనడమే గాకుండా వాళ్ళ నాన్న దగ్గర కూడా పబ్లికుచెయ్యమని బ్రతిమాలాడు వాళ్ళ నాన్నగారు ఎమ్. ఎల్. ఏ. ఎప్పుడూ పాలిటిక్స్ పొలైట్‌గా మాట్లాడుతూంటాడు ఇంట్లో వాళ్ళందరినీ గూడా అవే మాట్లాడమంటాడు అంచేత భీమారావు కూడా పాలిటిక్స్ అలవడినయి పైగా బి. ఏ.లో పాలిటిక్స్ కూడా ఓ సబ్జక్టుగా

## కల్యాణి పెళ్ళి

తీసుకొన్నాడు అతను ఒకటో క్లాసు మంచీ బి. ఏ సెకండ్ ఇయర్ వరకూ అన్ని క్లాసుల్లోనూ మానేటరుగానూ, లేపోతే స్టూడెంట్సు యూనియన్ కీలక స్థానాల్లోనూ నుంచుని గెల్చుకొంటూనే వున్నాడు ఎమ్మెల్యే ఎలక్షన్సులో కూడా వాళ్ళ నాన్నగారికి పెద్దఎత్తున కాన్వాసింగ్ చేసి సగం విజయానికి కారకుడయ్యాడు. ఎలక్షన్లోని తంత్రాలన్నీ ఇట్టే అలవడి పోయినయి ప్రస్తుతానికి వాళ్ళ నాన్నగారి కంటే గూడా ఎక్కువ జ్ఞానం సంపాదించుకొన్నాడు. అసలతనీ సంవత్సరం ఎలక్షన్లో నుంచోకపోడం కూడా పొలిటిక్సే. కారణం అతను కల్యాణి ఆ కాలేజీలో చేరిన కొద్ది గంటల నుంచే ఆమెని ప్రేమించడం మొదలెట్టాడు అటువంటి అందమయిన చిన్నది తన సరసన చిరునవ్వు నవ్వుతూ నిలబడితే, మినిష్టరు గూడా అయిపోవచ్చు అనుకొన్నాడు. అతనింకా అలా అనుకొంటూండగానే కల్యాణి పోటీ చేస్తున్నదన్న సంగతి తెలిసింది అసలు తనే ఆ స్థానానికి పోటీ చేద్దామనుకొన్నాడు కాని ఈలోగా అతని రాజకీయపు బుర్రలో ఓ ఆలోచన తళుక్కుమంది తను పోటీ చేయకుండా కల్యాణిని సపోర్టు చేసి గెలిపిస్తే ఆ తరువాత కల్యాణికీ తనకీ, పరిచయం వృద్ధి అయిపోయి తెలుగు సినిమాలోలా ప్రేమగా మారిపోతే . కాని భీమారావు అనుకొన్నదంతా జరుగలేదు. సుబ్బారావు విక్రెడా అయిపోయాడు. దాంతో భీమారావు అనుకొన్నదంతా జరగడానికి స్కోపు లేకుండాపోయింది. అయినా రాజకీయ జీవి అధైర్యపడడు. భీమారావు నిరాశపడలేదు. పైగా మరింత పుంజుకొన్నాడు. ఈలోపల వాళ్ళమ్మ భీమారావు కోరిక అతని తండ్రి దగ్గర 'పబ్లికు' చేసింది.

"ఏడ్చాడు బి. ఏ. కంప్లీటవనీ! ఇప్పుడే పెళ్ళేమిటి?" అన్నాడు వాళ్ళ నాన్న.

"కంప్లీటయినట్లే" అన్నాడు భీమారావు డోర్‌కర్టెన్ వెనుకాల నుంచొని.

"హాదేమిటి? పరీక్షలు కమెన్సవ లేదు కదా?" అని ఆశ్చర్యపోయాడాయన.

"అదంత 'ఎరేంజమెంట్సు' చేసేశాను. ప్రతి పరీక్షకీ పోయి అయిదు నిమిషాలు కూర్చుని వస్తే చాలు. మిగతాదంతా 'వాళ్ళు' చూసుకొంటారన్నాడు.

"అప్రాచ్యుడా!" అరచాడాయన.

వణికిపోయాడు భీమారావు

"వెధవ ఎరేంజిమెంట్స్ అసలా పదానికి అర్థం తెలిసేడ్చా అని నీకు అయిదు నిమిషాలు కూర్చోడమేమిటి? అలా కూర్చుంటే అదింకా ఎరేంజిమెంట్ ఎలా అవుతుంది ఆ టైము అక్కడేడ్చే బదులు రాబోయే మున్సిపల్ ఎలక్షన్లలో "మన నాయుడి"గారి తరఫున కాన్వాస్ చేస్తే ఎంత బాగుండేది అన్నాడు. ఇకనుంచి ఇలాంటి బుద్ధి తక్కువ 'ఎరేంజిమెంట్స్' పెట్టుకోవద్దన్నాడు. ఇంతకీ ఆ పిల్ల అడ్రసేమిటన్నాడు కాసేపాగి.

భీమారావు కళ్యాణి ఇంటి నంబరు వచ్చి చెప్పాడు.

"హోరి వాళ్ళా! వాళ్ళింట్లో వోట్లన్నీ మనవే!" అన్నాడాయన జరిగిన ఎలక్షను గుర్తు తెచ్చుకొంటూ. అసలా పిల్ల తండ్రి కూడా కొన్నాళ్ళు మునిసిపల్ చైర్మన్ చేశాడట.

'మంచిదేలే వాళ్ళదీ మనదీ ఒకటే రాజకీయ కులం అన్నాడు. నువ్వికపోయి నేజెప్పిన ప్రకారం ఎరేంజిమెంట్ కోసం ప్రయత్నించమన్నాడు.

భీమారావు అప్పుడే గెలిచిన అభ్యర్థిలా ఒక్కఉదుటన వీధిలో పడ్డాడు. ఆ సంతోషంలో కనబడ్డ ఓటరుకల్లా కాఫీ త్రాగించాడు.


భీమారావు అనుకొన్నంత త్వరగా లేకపోయినా, నెల్లోజులు తేడాలో అతనికీ కల్యాణికీ వివాహం అయిపోయింది పెళ్ళికి బోలెడుమంది ఎమ్మెల్యేలు, కొంచెంమంది ఎంపీలు ఇంకా కుంచెంమంది మినిష్టర్లు వచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు.

"నువ్వు కూడా మా అంతవాడివి కావాల"న్నారు మినిష్టర్లు సరేనన్నాడు భీమారావు

"మా అంతవాడివి అవ్వు" అన్నారు ఎంపీలు 'ఊ' కొట్టాడు భీమారావు.

"మాలాగే పైకిరా!" అన్నారు ఎమ్మెల్యేలు "ఐవిల్ ట్రై" అన్నాడు భీమారావు. ఆ పెళ్ళిలోనే వచ్చే జనరల్ ఎలక్షన్సులో ఒకళ్ళు ఎంపీగానూ, మరొకళ్ళు ఎమ్మెల్యేగానూ నుంచోవాలని వప్పందాలు చేసుకొన్నారు భీమారావు తండ్రీ, కల్యాణి తండ్రీనూ చాలామంది వారిని అప్పటికప్పుడే బలపర్చారు.

రోజులు కొంటయ్యే వోట్లలా దొర్లినయి. చిన్న రాజకీయాలకి మంచిరోజులొచ్చేశినయి మునిసిపల్ ఎలక్షన్లు.ఒక్కో వార్డుకీ బోలెడుమంది అభ్యర్థులు నామినేషన్లు పడేశారు. అందులో గెలుస్తామని నమ్మకం వున్న వాళ్ళ కంటె లేనివాళ్ళు ఎక్కువగా వున్నారు. మరి ఆ అసహ్యమయిన కోరికలు కోరే వార్డుకి ఎవరు నుంచోవాలో ఎవ్వరికీ తెలీలేదు. అక్కడి ప్రజలు అసలీ ఎలక్షన్లో ఎవ్వడికీ వోటు వేయమని ఖచ్చి



ఇలాగా చెప్పేశారు. ఇదిలా వుండగానే హఠాత్తుగా వోరోజు మధ్యాహ్నం "నేనా వార్డుకి నుంచుంటా నాన్నా!" అన్నాడు భీమారావు. ఆయనో సారి కొడుకుని ఎగాదిగా చూశాడు.

కాసేపలా చూసి "సియ్యస్మం" అన్నాడు.

"నుంచుంటే ఏంలేదుగాని, మునిసిపల్ కౌన్సిలర్‌తో నీ కారీర్ మొదలెడితే ఫ్యూచర్ అనుమానం అన్నాడు. మినిమమ్ స్టార్ట్ ఎమ్మెల్యే వుండాలన్నాడు. అప్పుడు కాని సెంట్రల్ క్యాబినెట్ వరకూ ఎగ్రబాకటానికి వీల్లేదన్నాడు. అయినా అడిగావు గనుక కానిమ్మన్నాడు. తన కుడి భుజాలు నలుగురిని పిలిచి "అబ్బాయి ఫలానా వార్డుకి నుంచున్నాడు. అక్కడి వాళ్ళందరినీ సిద్ధం చెయ్య్"మన్నాడు తనూ సిద్ధమయాడు కండువా భుజాన వేసుకొని ఈలోపల భీమారావు తన ప్రయివేటు గాంగుని పదిహేను మందిని పిలిచి, కాఫీలు త్రాగించి, ఓసారి రాంబీనాయుడి జీపులో వార్డంతా సైలెంట్ కాన్వాస్ మొదలెట్టమన్నాడు ప్రారంభ సూచకంగా. ఆ మర్నాటి నుంచీ తనూ రంగంలోకి దూకాడు.

హఠాత్తుగా ఓరోజు అతను అనుకోకుండా అతనికీ, కల్యాణికీ, మాటామాటా వచ్చి, పెద్ద 'వార్' జరిగి, కల్యాణి తన సామాన్లు సర్దుకొని పుట్టింటికి వెళ్ళిపోడంతో ముగిసింది. మాటామాటా రావడానికి కారణం కల్యాణి అని భీమారావు అనుకొన్నాడు. అసలు సంగతి కల్యాణి ఎమ్మెల్యేగారి కోడలయిన మర్నాటి నుంచీ కల్యాణమ్మ అయింది. రోజూ మామగారి కారు మీద లేడీస్ క్లబ్‌కు వెడుతోంది. అక్కడ ఇన్‌ఫ్లుయెన్స్‌చేసి సెక్రటరీ అయికూర్చుంది. మరో రెణ్నెల్లు తిరక్కమునుపే ఇంకా పెద్ద పెద్ద క్లబ్బుల్లో మెంబరయి పోయింది. అవసరమొచ్చిన చోటల్లా మామగారి ఇన్‌ఫ్లుయెన్స్ వుపయోగించుకొంటోంది ఊళ్ళో చాలామంది పెద్దలు కల్యాణమ్మని తమలోనీ పెద్దగా గుర్తించారు ఆమె ఏ షాపు కెళ్ళినా, సినిమాకి వెళ్ళినా, ఏ హోటలుకి వెళ్ళినా, ప్రొప్రయిటర్లు బయటికి వచ్చి, మర్యాదగా ఆమెని ఆహ్వానించి, పలుకరించి, కాఫీ తెప్పించి, కుర్చీ చూపిస్తున్నారు. ఆమెకు ఆ ఊళ్ళో గొప్పగొప్ప ఆడాళ్ళందరితోనూ స్నేహమయిపోయింది. అంతటితో ఆగితే తన గొప్పతనమే లేదనుకొంది. అంచేత వాళ్ళ భర్తల దగ్గర కూడా మంచి పరిచయం సంపాదించుకొంది. ఎక్కడ చూసినా ఆమె పరపతి పెరిగిపోయింది. అంచేత బిజీ ఎక్కువయిపోయింది. ప్రొద్దున్న ఎనిమిదింటికి ఇల్లు వదిలితే రాత్రి పది, పదకొండు గంటలకు తిరిగి ఇంటికొస్తోంది. రానురాను భీమారావుకిది నచ్చటం మానేసింది. భార్య 'మోడరన్'గా వుండాలిగాని ఇంత 'టూమచ్' పనికి రాదనుకొన్నాడు ఏమాత్రం బావుండ లేదనుకొన్నాడు అదే పైకన్నాడు కల్యాణితో. రాకెట్టులా లేచిందామె. పైన కప్పుండటం మూలాన ఆగిపోయిందిగాని, లేకుంటే ఆ విసురికి పైకిపోయి కక్ష్యలో తిరుగుతూండేది.

"మీదొట్ట వృక్రోష బుద్ధి!" అంది.

'నాకూ కొన్ని ఆదర్శాలూ, అభిరుచులూ వున్నాయంది. అవన్నీ జరిగి తీరాల్సిందే అంది. మీ కిష్టం లేపోతే పోనీమంది. 'ఐకాన్ట్ హెల్పిట్' అంది. భీమారావుక్కోపం వచ్చింది.

అతని కోపం చూసి మరో నాలుగు మాటలందామె.

ఆమె అనడం చూసి అతని కోపం మరో నాలుగు డిగ్రీలు పెరిగింది. ఆమె చెంపసీమ టపాకాయలా మ్రోగింది.

"యూ ఆర్ ఎఫూల్!" అని అరచిందామె కళ్ళ వెంబడి నీరు తిరిగి

"సే దట్ యూఆర్ సారీ!" అంటూ మూడుసార్లు అతని కాలరు పట్టుకు గుంజింది మెడ మీద చెయ్యివేసి ఆమెని గదిలో నుంచి బయటికి త్రోసివేశాడతను మరోక్షణం కూడా ఆ యింట్లో వుండదల్చుకోక పుట్టింటికి చక్కా వచ్చేసింది.


"నాన్నా"అంది ఇంట్లోకి రాగానే గోముగా.

"ఏమిటమ్మా" అన్నాడాయన.

"నేను మనింట్లోనే వుంటాను "అంది.

సరేనన్నాడాయన. ఎందుకని కూడా అడగలేదు. కల్యాణమ్మ ఇప్పుడు సర్వ స్వతంత్రిణి. అంచేతే భీమారావు ఫలానా వార్డుకి నుంచున్నాడని తెలిసే, తనూ ఆ వార్డుకే నామినేషన్ పడేసింది. తనంటే ఏమిటో అతడికి తెలసిరావాలనుకొంది లేడీస్ క్లబ్ మెంబర్లందరినీ 'తన్ని గెలిపించమని', రిక్వెస్టు చేసింది మన ఆడవాళ్ళు తలచుకొంటే కాందేది అని ప్రశ్నించింది 'నిజమే' నన్నారు వాళ్ళు. అయితే మరింకా ఆలస్యం దేనికంది. వెంటనే కాన్వాసింగ్ ప్రారంభమయింది. ఆవార్డు వాళ్ళందరూ గుమిగూడి "మన వార్డుకి ఓ ఆడామె నుంచుంది రోయ్! పైగా ఈవిడ భీమారావు పెళ్ళామేనంట!" అనుకొన్నారు కల్యాణి తండ్రీ, భీమారావు తండ్రీ, మరో చిన్న వ్యవహారంలో, ఎక్కడో కలుసుకొన్నప్పుడు, ఈ మాట వచ్చింది కాని, కల్యాణి తండ్రి దానికేమంత ప్రాముఖ్యత ఇవ్వలేదు "గెలుస్తే నా అల్లుడు గెలుస్తాడు. లేపోతే నీ కోడలు గెలుస్తుంది ఎవరయినా మనమే గదా" అన్నాడు. కీచులాట కేముందిలే పెద్ద పెద్ద మినిష్టరు లాంటి వాళ్ళు కీచులాడుకోడం లేదా అన్నాడు 'అమ్మాయి సరదా పడింది నుంచోనీమన్నాడు ' ఏకీభవించారు ఎం ఎల్ ఏ గారు.

పోలింగ్ రోజు వారంరోజుల పరిధిలో కొచ్చేసరికి ఇరుపక్షాల వారి ప్రచారం ఎక్కు






## కళ్యాణమ్మ

వయిపోయింది. భీమారావు మధ్యరకం, పెద్ద రకం పెద్ద మనుష్యుల్ని ఓ పదిమందిని వెంటేసుకొని వార్డంతా తిరిగి ఏ స్ట్రీటుకి పంపు కావల్సిందీ, ఎక్కడ కట్టించాల్సిందీ, ఏయే రోడ్లు మెటల్ చెయ్యాల్సిందీ, ఎన్ని ఎలక్ట్రిక్ పోల్సుకావాల్సిందీ, అన్నీ కాగితం మీదరాసుకున్నాడు. 'నన్ను మీరు గెలిపించేట్లయితే, నేను చైర్మన్ తప్పక అవుతాను. అప్పుడివన్నీ చేయించడానికి బోలెడు వీలుంటుందన్నాడు అందుకనే కాగితం మీద వ్రాసుకుంటున్నా నన్నాడు ప్రతి ఇంట్లో చిన్నపిల్లనెత్తుకు ముద్దాడాడు. ఏ కాస్త తెలిసిన వాళ్ళున్నా, వరుసలు కలిపి 'బాబాయి, పిన్నీ' అన్నాడు. ఏమాత్రం తెలియని వాళ్లతో 'దయుంచాలి సార్' అన్నాడు. బాగా పరిచయం వున్నవాళ్లతో "మన వాళ్లందరూ నుంచోబెట్టారు గురూ! ఏమంటావు మరి!" అన్నాడు. ఆవార్డు వాళ్లు దేవాంతకులు. అంతా విని

"ఈ సొద మాకేం క్రొత్తకాదు పది ఎలక్షన్ల నుంచీ చూస్తూనే వున్నాము ఒక్కపనీ అయి చచ్చింది లేదన్నారు భీమారావు క్కోపమొచ్చింది. "నన్ను గెలిపించండి! ఈ పనన్నీ జరిపించకపోతే నా పేరు భీమారావు కాద"న్నాడు.

"ఓశ్! ఇదీ పాతదే?" అన్నారు వాళ్ళు.

"అయినా సరే మరోసారి ట్రై చేసి చూడం"డన్నాడు.

కళ్యాణమ్మ ప్రచారం ముమ్మరంగానే సాగుతోంది. ఆవిడ ప్రతి ఇంటిలోనూ, సరాసరి వంటింట్లోకి వెళ్లిపోయి, వంట వండుతున్న ఆడాళ్లకి సహాయపడుతూ, నూతి దగ్గర బట్టలు వుతుకుతున్న ఆడాళ్ల దగ్గర, బకెట్లోకి నీళ్లు తోడుతూ, ఏమీ చేయకపోతే దగ్గరే పీట వేసుక్కూర్చుని "ఈ మొగాళ్లు ఎన్నిసార్లు చెప్పినా మన పేట అవసరాలేమీ చూడరు, వాళ్లు ఎలక్షనులో గెలచీ మనకేం వుపయోగం లేకుండా పోతోంది, మనకీ స్వాతంత్ర్యం (స్త్రీలకి) వచ్చేసి చాలాకాలమయిపోయిందీ, ఇంకా వాళ్ల మీద ఆధారపడేదేమిటి, అంచేత నేనే నుంచుని, వాళ్లని ఓడించి, వాళ్ల మొహమ్మీద కొట్టినట్లు ఈ పనన్నీ చేసి చూపిస్తాను, ఏమంటారు?" అడిగింది.

"మనలో మన మాటొదినా! నువ్వు దగ్గర దానివి కనుక చెప్తున్నా, మళ్లీ ఎవ్వరి తోటీ అనకు ఈ వీధి పైపు మాయింటి ముందు వచ్చేట్లు చూస్తా"నంది. అలా అని ప్రతి ఇంట్లోనూ చెప్పింది. తనని గెలిపించమని అన్నయ్యగారితోనే కాకుండా, ఆయన స్నేహితుల క్కూడా చెప్పించమంది. కొంతమంది బరితెగించిన ఆడాళ్ళు, పతివ్రత ఫోజుపెట్టి 'మీ ఆయనకే ఎదురు నుంచున్నావా? అవ్వ!' అని నోరు నొక్కుకుంటే విసుక్కోక, శాంతంగా "ఆయన సంగతి నాకు తెలీదా! ఒట్టి బద్ధకం మనిషి! ఏ పనీకాదు ఇహ ఈ వార్డు ఎప్పటిలానే వుండిపోతుంది. అందుకనే నేను నుంచూంట." అని జవాబిచ్చింది. వసారాలో పడక్కుర్చీలో కూర్చుని పేపరులో తలదూర్చిన ఇంటాయనతో "అన్నయ్యగారూ! ఈ వీధంతా మీరెటు చెప్తే అటు వింటారని విన్నాను. మీ చెల్లెలు గెలవాలి నుంటే 'ఇటే' చెప్ప"మంది. అయినా ఇదంతా నా అత్రుతేగాని మీరు చెప్పకుండా ఎలా వుండగలరంది అని ఇదిగా చూసింది సరే నన్నారు మొగాళ్ళు "ఓ దానికేముంది" అన్నారు

"సరే గెలిపిస్తాం! ఈసారి నువ్వేంచేస్తావో చూస్తాం" అన్నారు

కళ్యాణమ్మ కొంతమంది ఆడ వాలంటీర్లని ఏర్పాటు చేసుకొంది. వాళ్ళు ఓడొక్కు 'వాన్' లో తిరిగి ప్రచారం మొదలెట్టారు. మైకెట్టుగొని "మీ వీధిలో పైపులు కావాలంటే మీ వోట్లు కళ్యాణమ్మకే, మీ వీధిలో లైట్లు కావాలన్నా మళ్లీ కళ్యాణమ్మకే మీ ఓట్లు, రోడ్లు సిమెంటు కావాలన్నా ఆవిడకే మీఓట్లు, పార్కు బాగుపడాలంటే కళ్యాణమ్మకే మీ ఓట్లు" అంటూ కేకలేశారు. దాంతో కళ్యాణమ్మ, మనిషితో బాటుగా పేరు కూడా పాప్యులర్ అయిపోయింది. ఆ వార్డులో ఆడాళ్లందరిలోనూ చైతన్య మొచ్చేసింది. ఈ మొగాళ్ల పరిపాలన ఎంతకాలమన్నారు ఇంట్లోలేని అధికారాలు బయట మాత్రమెందుకన్నారు. అది విని మగాళ్లు కోప్పడ్డారు. ఇంట్లో మీ ఆడాళ్లే నిరంకుశత్వంగా పరిపాలిస్తు

న్నారు గదా, బయట కూడా మీరే వచ్చేస్తే, ఇంక మాగతేమిటన్నారు. అవయినా మాకొదలమన్నారు. ఆడాళ్ళు ససేమిరా ఒప్పుకోలేదు. పైపెచ్చు మేం చెప్పిందాన్ని కాదంటానికి వీల్లేదని నిర్బంధించారు ఆడాళ్ళు పరిపాలనలో నయినా మనవార్డు పాట్లు తీరతవేమో అన్నారు ఈ పదెలక్షన్ల నుంచీ మీ మగాళ్ళు చేసిందేమిటో చూపించమన్నారు. తెల్లమొగం వేసి ఒప్పుకొన్నారు మొగాళ్ళు. అయినా 'ఆడా, మగా' భేదమేమిటి లెద్దూ అన్నారు. ప్రస్తుత ప్రపంచంలోనే ఆ భేదం తీసేయాలని ప్రయత్నిస్తున్నారు గదా! వెధవది ఇంత చిన్న వ్యవహారానికి ఆ భేదాలేమిటన్నారు.

ఎలక్షనయిపోయింది. కల్యాణి పెద్ద మెజారిటీతో గెల్చుకొంది. భీమారావుకి వార్డు ప్రజల మీద ఒళ్ళు మండిపోయింది. ఇలాంటి విశ్వాసఘాతకులయిన, వీళ్ళ వార్డులో నేను గెలవకపోడమే మంచి దయిందనుకొన్నాడు. అతని గుండెల్లో ఓమూల కల్యాణి మీద గౌరవం కూడా కలిగింది. తనంతటి వాణ్ణి చిత్తు చేసినంతటి కల్యాణి తన భార్య అయినందుకు గర్వించాలనుకున్నాడు. ఆ సాయంత్రమే కల్యాణమ్మ కారులో మావయ్యగారింటి కొచ్చేసింది. ఎమ్మెల్యేగారు వాకిట్లోంచె ఎదురు వెళ్ళి ఆప్యాయంగా ఆమె తల నిమిరేరు. "నా అంతటి దానివే నువ్వు" అన్నారు. 'నాపేరు నిలచింది' అన్నారు.

గదిలోకి రాగానే "నన్ను మించిపొయ్యావే నువ్వు! కంగ్రాచ్యులేషన్సు" అన్నాడు భీమారావు నవ్వుతూ. అందుకు మీరే కారణవంది కల్యాణి. భీమారావుకి బోలెడు పొలిటికల్ స్పిరిటుంది. పొలిటికల్ స్పిరిటంటే ఎలక్షన్లో గెలిస్తే ఏడ్వడమూ, ఓడిపోతే నవ్వడమూ అన్నమాట. అంచేత బోలెడుసార్లు నవ్వాడు భీమారావు కల్యాణితో మాట్లాడుతూ. ఇద్దరూ తమకి జరిగిన కీచులాట మరచిపోయారు "అసలు నేనింత త్వరగా రాజీ పడ్డానికి మీరే కారణవంది" కల్యాణి అదేవిటన్నాడు భీమారావు ఆశ్చర్యంగా.

"అవును మరి. నేను ఛైర్మన్ అవ్వాలంటే మిగతా కౌన్సిలర్లందరినీ ఆకట్టుకోవాలి. ఆపని మీవల్లా, మావయ్యగారి వల్లా తప్పితే మనోహరి వల కాదంది. తనవల్ల అసలే కాదంది. పొంగిపోయాడు భీమారావు. ఆమెని దగ్గరకు లాక్కొని, "నువ్వెప్పుడో మినిష్టరు వయిపోతా" వన్నాడు. అయినా ఆశ్చర్యపడనన్నాడు. ఇంకోళ్ళు పడకూడదన్నాడు. ఎమ్మెల్యేగారూ అదే అన్నారు. మరో నెల్రోజుల్లో 'కౌన్సిలర్ కల్యాణమ్మ' అల్లా 'ఛైర్మన్ కల్యాణమ్మ' అయిపోయింది. ఒక్కవార్డే కాదు. వూరంతా ఆమెదే ఇప్పుడు ఆమాటే తన వార్డులోని ఆడాళ్ళందరూ ఓరోజు తన దగ్గర కొచ్చి "రోడ్లన్నావు, పంపులన్నావు, లైట్లన్నావు, పార్కన్నావు, ఏదీ" అని అడిగినప్పుడు అవి మనమనుకొన్నంత సులభం కాదంది. జరగడానికి చాలా టైము పడుతుందంది. ఎంత టయిమనిడిగితే చెప్పడం చాలా కష్టవంది. అయినా నా శాయశక్తులా ప్రయత్నిస్తానంది. పైగా ఇప్పుడు ఊరంతా చూసుకోవాలి.మన ఒక్కవార్డే కాదు గదా అంది. అంతా అయాక 'నాకు మీటింగుంది. ఇక మీరు వెళ్ళి రండి' అంది టైము చూసుకొని కాలింగ్ బెల్ నొక్కుతూ. ఆడాళ్ళందరూ అంతా విని "నీ కంటే ముందున్న కౌన్సిలరే నయమన్నారు. పని చేయించకపోయినా ఎప్పుడడిగితే అప్పుడు "వారంరోజుల్లో పైపు లైన్లొస్తున్నాయి. రోడ్లు వేసే వాళ్ళు వస్తున్నారు. పోల్సు తెప్పిస్తున్నాం" అనే వాడన్నారు. అని ఇంటికి తిరిగొచ్చారు. రాగానే మొగాళ్ళని తిట్టారు. ఆమెని కౌన్సిలరు చేసింది ఆడాళ్ళేగాని, మళ్ళీ ఛైర్మన్ చేసి ప్లానంతా చెడగొట్టింది మీ మగాళ్ళే అన్నారు మగాళ్ళు మాట్లాడలేదు. మళ్ళీ తమ కౌన్సిలరుగారికి 'అసహ్యమయిన కోరికల' అర్జీ వ్రాయడంలో నిమగ్నమయిపోయారు. "కంకరరోడ్లు కావాలి. వీధి కొకటయినా కొళ్ళాయి వుండాలి. ."

ఆడాళ్ళు మళ్ళీ నూతిలోని చప్పని నీళ్ళని తోడుతూనే వున్నారు. అక్కడి వాళ్ళందరూ రాత్రుళ్ళు చీకటిలో తడుముకొంటూ నడుస్తూనే వున్నారు వర్షాకాలం మట్టిరోడ్ల మీద నెలల తరబడి మోకాలు లోతు నీళ్ళు నిలచే వుంటున్నాయి. ●

